ప్రజాశక్తి

మంగళవారం 14 అక్టోబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మత్స్యకారులకు, వెంకట్రావు అనుచరులకు మధ్య వివాదం జరుగుతున్న దృశ్యం

స్ట్రెయిట్‌కట్ కాలువ..
కొలతలపై గొడవ

- సర్వే తప్పుగా చేస్తున్నారంటూ మత్స్యకారుల ఆందోళన
- నిలిచిపోయిన సర్వే

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల – బాపట్ల మండలాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ వంపును పూడ్చివేసిన విషయమై మత్స్యకారులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్ట్రెయిట్‌కట్ కాలువ హద్దులు నిర్ధారించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మత్స్యకారులు, రైతు బుర్ల వెంకట్రావు సమక్షంలో అధికారులు సర్వే చేపట్టారు. కొలతలు ప్రారంభమయిన కొద్దిసేపటికే భూ సర్వే తప్పుగా ఉందంటూ మత్స్యకారులు అభ్యంతరం చెప్పారు. వివాదాస్పద భూమి ప్రారంభం వద్ద స్ట్రెయిట్ కట్ కాలువ సర్వే అధికారుల లెక్కల ప్రకారం 187 మీటర్లు ఉండాలి. కానీ అక్కడ స్ట్రెయిట్ కట్ 30 మీటర్ల లోపు లోనే ఉంది. దీంతో అక్కడ 150 మీటర్ల మేర కాలువ ఆక్రమణ జరిగినట్లు మత్స్యకారులు సర్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్ట్రెయిట్‌కట్, సీ మౌత్ కలిసే చోట ▶ 2లో

ముదురుతున్న ఇసుక వివాదం

- డంపింగ్ యార్డుకు పోటీగా కొందరు వ్యాపారం
- స్థానిక ట్రాక్టర్ల యజమానులపై కేసులు.. పెనాల్టీలు
- ఉచిత ఇసుక అనే అంశాన్నే మరిచిన పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో ఇసుక వ్యవహారం ముదురుతోంది. రాజకీయంగానూ దీనిపై తర్జనభర్జనలు పడుతున్నారు. నిర్మాణ దారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇల్లు కట్టుకునేవాళ్లు సమీపంలోని వాగులు, వంకల నుంచి ఇసుకను తెచ్చుకుని వినియోగించుకోవచ్చని సూచించింది. అయితే ఆ విధానం ఎక్కడా అమలు కావడం లేదు. ఇసుక వ్యాపారంగా మారింది. పాలకపక్ష నేతల చేతుల్లోకి వెళ్లింది. వాళ్లు చెప్పిందే వేదంగా మారింది. ఎవరైనా వాగుల్లోకి వెళ్లి ఇసుకను తెచ్చుకుంటే పోలీసులను పంపి.. కేసులు పెట్టిస్తున్నారు. మైనింగ్ శాఖ ద్వారా పెనాల్టీలు వేయిస్తున్నారు. ఇసుక వ్యవహారం ఇప్పుడు వాడివేడిగా మారింది.

ఇక ఒంగోలులో ఇసుక వివాదం తారాస్థాయికి చేరింది. ఇసుక అందుబాటులో లేనప్పుడు డంపింగ్ యార్డు నుంచి ఇసుక సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఒంగోలు మార్కెట్ యార్డులో డంపింగ్ యార్డు పెట్టారు. టన్నుకు ధర నిర్ణయించారు. నెల్లూరు నుంచి ఇసుకను తెచ్చి నిర్మాణదారులకు అమ్ముతున్నారు. నెల్లూరు నుంచి ఇసుక ప్రస్తుతం ఆగిపోయింది. ఇక జిల్లాలోనే అందుబాటులో ఉన్న వాగులు, నదుల్లో ట్రాక్టర్లతో తెచ్చి అమ్ముతున్నారు. మొన్నటి వరకూ నెల్లూరు నుంచి కొందరు నాయకులే టిప్పర్లతో తెచ్చి అమ్మకాలు చేశారు. డంపింగుయార్డు బయట అమ్మకాలపై డంపింగ్ యార్డు కాంట్రాక్టర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవహారం వివాదంగా మారింది. మైనింగ్ అధికారులూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు చేస్తున్నారు. జరుగుమల్లి, గుండ్లకమ్మ నదుల ▶ 2లో

ఆందోళన ఉధృతికి సన్నాహాలు

- కొనసాగుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె
- మైనింగ్ మంత్రి పిలుపు కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ సీనరీ వసూలు ఏఎమ్ఆర్ ప్రైవేట్ సంస్థకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఫ్యాక్టరీ యజమానులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. పాలకులు ఈ సమస్య పరిష్కారం దిశగా ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని యజమానులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నేడో, రేపో చూసి తమ సమ్మె బాటను ఆందోళన పథంలో చేపట్టాలని యాజమాన్యాలు యోచిస్తున్నాయి.

ఈ పాటికే యజమానులు రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, మైనింగ్ అధికారులకు వినతిపత్రాలు అందజేసి.. సమస్యలను విన్నవించుకున్నా.. ప్రయోజనం శూన్యంగానే ఉంది. ఒక వైపు గ్రానైట్ కార్మికులు తరలి వెళ్లడం, మరోవైపు సాఫీగా సాగుతున్న గ్రానైట్ పరిశ్రమపై ఏఎంఆర్ సంస్థ అదనపు వసూలు పేర మోపనున్న పిడుగు లాంటి వార్త గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరీ నెలనెలా చెల్లిస్తున్నా.. ▶ 3లో

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

11 నుంచి 12 గంటల మధ్య
ప్రతిరోజూ కలెక్టర్‌ను కలవొచ్చు..

- ప్రజల సంతృప్తి స్థాయి పెంచాలి..
- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, పీజీఆర్ఎస్ సిబ్బంది పనితీరు మార్చుకొని, ప్రజల సంతప్తి స్థాయి పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ప్రతిరోజూ 11 నుంచి 12 గంటల మధ్య ప్రజలు కలెక్టర్‌ను కలవొచ్చని సూచించారు. సిబ్బంది పని తీరుపై సోమవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్షించారు. కలెక్టరేట్‌లో సిబ్బంది చురుగ్గా పని చేయాలని, పనితీరులో నాణ్యత ఉండాలని చెప్పారు. పిజిఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీనీ నిశితంగా పరిశీలించాలని, పరిష్కరించిన తదుపరి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం అర్జీలు రాయడానికి సిబ్బందిని నియమిస్తామన్నారు. చుక్కల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించ డానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన ప్రతి అర్జీకి వీఆర్వో నివేదిక ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కల్వర్టును ఢీకొన్న మినీ బస్సు

- ఒకరు మృతి
- 19 మంది విద్యుత్ సిబ్బందికి గాయాలు
- సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

కల్వర్టును మినీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. 19 మంది విద్యుత్ సిబ్బంది గాయపడిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా పలమనేరు నుండి విద్యుత్ శాఖకు చెందిన వారు 20 మంది ఉద్యోగులు మినీ బస్సులో (బస్ నెం. ఎపి 39 విబి 2534) విజయవాడలో జరిగే విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు వెళుతున్నారు. వల్లూరులోని రైస్ కాలేజీ దాటిన తర్వాత మినీ బస్సు డ్రైవర్ నిద్రమత్తులో రోడ్డు సైడ్ ఉన్న కల్వర్టును ఢీ కొట్టాడు. దీంతో బస్సు పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. మినీ బస్సులో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా, గంగవరం మండలం, పత్తికొండకు చెందిన కామాటం చరణ్‌కుమార్ (35) మృతి ▶ 2లో

బోల్తా పడిన మినీ బస్సు

కల్వర్టును ఢీకొన్న మినీ బస్సు

(మొదటిపేజీ తరువాయి)

చెందారు. మరో 19 మందికి గాయాలయ్యాయి. చరణ్‌కుమార్ పత్తికొండ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య ప్రీతి, పాప లిఖిత (4 సంవత్సరాలు) ఉన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిలో యస్.బాలసుబ్రమణ్యం, బొమ్మనపల్లి బాలకష్ణ, రవ్వల రాజేష్, తిమిదేలపాటి దినేష్, నంగిలి మహేష్, వలిగట్ల ప్రసాద్, సోహేల్, విరాజీ గౌరీశంకర్, గుండ్ల కట్టమంచి పథ్వి, ఖాదర్‌బాషా సికిందర్, ఆకుబోతు శ్రీనివాస్, నాయక్, సూరేపల్లి రామ్మోహన్‌బాబు, యస్.కె.సురేంద్ర నాయుడు, గాటి మురుగేష్, ఆర్‌ఎమ్.హరికుమార్, సి.అనిల్‌కుమార్, మొగనవల్లి మురళి, నర్రా కుపేంద్రుడు, బస్సు డ్రైవర్ కృషిని వినోద్ ఉన్నారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని టంగుటూరు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు పరిశీలించి.. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఉద్యోగులకు సిపిఎం పరామర్శ...

ఒంగోలు సిటీ: రోడ్డుప్రమాదంలో గాయపడి.. రిమ్స్ లో చికిత్స పొందుతున్న విద్యుత్ ఉద్యోగులను సిపిఎం నాయకులు పరామర్శించారు. అక్కడే ఉన్న జిల్లా అధికారులతో నాయకులు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నందువల్ల అనివార్యమైన పరిస్థితిలో ఉద్యోగులు ఆందోళన పట్టాల్సిన పరిస్థితి వచ్చిందని వారు పేర్కొన్నారు. రోడ్డుప్రమాద ఘటనకు ప్రభుత్వం భాద్యత వహించాలని ప్రకటించారు. మరణించిన కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించే విధంగా చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్ తదితరులు ఉన్నారు.

ముదురుతున్న ఇసుక వివాదం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ట్రాక్టర్లతో తెచ్చి ట్రక్కు రూ.2200 నుంచి రూ.2500కు అమ్ముతున్నారు. అదే డంపింగు యార్డులో కొంటే నాలుగు వేలకు పైగానే పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. అయితే డంపింగ్ కాంట్రాక్టర్ ఫిర్యాదుతో పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుంటున్నారు. దీంతో తమ ఉపాధి పోతుందని, తమ కడుపుకొడుతున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకఅమ్ముకుంటే ఐదు వందలే మిగులుతాయంటున్నారు. దీన్ని కూడా కాదంటే ఎలా బతకాలని చాలా కాలంగా ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుని జీవనం సాగిస్తోన్న వాళ్లు వాపోతున్నారు. ఎమ్మెల్యేకు చెప్పినా పట్టించుకోలేదంటున్నారు. తాము తక్కువ ధరకు ఇసుకను ఇస్తుంటే తమపై కేసులు పెట్టడం ఏమిటంటున్నారు. డంపింగు యార్డు నుంచి కొంటే రూ.2 వేలు అదనంగా పెట్టాలి. వాస్తవానికి ఇక్కడ అధికారులు, పాలకపక్షనేతలూ ఆలోచించాలి. అందుబాటులో ఉన్న వనరుల నుంచి తెచ్చి ట్రాక్టర్ల యజమానులు తక్కువ ధరలకు ఇస్తున్నారు. అదే డంపింగ్ యార్డు నుంచి కొంటే అదనంగా పెట్టాలి. ఇప్పుడు ఎక్కడ ఇసుక తెచ్చుకోవాలనేది అధికారులే చెప్పాలి. తక్కువ ధరకు ఇచ్చే ట్రాక్టర్ల వద్ద కొనాలా? లేక ఎక్కువ ధర చెల్లించి డంపింగ్ యార్డులో తెచ్చుకోవాలా? అనేది ఆలోచించాలి. అధికారుల చర్యలు చూస్తే ఎక్కువ ధరకైనా డంపింగ్ యార్డులోనే కొనాలనే ఆదేశాలే కనిపిస్తున్నాయి. అంతిమంగా జనంపై భారం పడుతోంది. దీనిపై పాలకులు కూడా ఆలోచించాలి. ఏదేమైనా ఒంగోలులో ఇసుక వ్యవహారం రాజకీయంగానూ చర్చకు దారితీస్తోంది. ఉచిత ఇసుక అనే విషయాన్ని అధికారులు కూడా మరిచిపోయారు. ఇసుకను వ్యాపారంగానే మార్చారు. కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఇతర ప్రాంతాల నుంచి డంప్ చేసి విక్రయాలు చేయడంతోనే ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అందుబాటులో ఉన్నప్పుడు దాన్ని వినియోగించుకునే మార్గాలు చూడాలి. మళ్లీ ఇసుక సంక్షోభానికి తెరలేపారు. ఇసుక ఉచితంగా నిర్మాణదారులకు అందించాల్సిన అంశాలపై అధికారులు దృష్టి సారించాలి.

కొండపిలో పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,331 పొగాకు బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 1,062 బేళ్లు కొనుగోలు చేశారు. మిగిలిన 269 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.315, అత్యల్ప ధర కిలో రూ.70, సరాసరి ధర కిలో రూ.188.60 పలికిందని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు.

స్లైయిట్‌కట్ కాలువ కొలతలపై గొడవ..

(మొదటిపేజీ తరువాయి)

కాలువ లోపలికి వెళ్లి కొలత హద్దులుగా చూయించడంతో మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. గతంలో కలెక్టర్ వచ్చిన సమయంలో చూపించిన కాలువ కొలత లెక్కకు, ఇప్పుడు చూపిస్తున్న దానికి చాలా తేడా ఉందని, తప్పుగా కొలుస్తున్నారని అభ్యంతరం చెప్పారు. దీంతో బుర్ల వెంకట్రావు తరపున వచ్చిన వారికి, మత్స్యకారులకు మధ్య వాగ్వివాదం నెలకొంది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఇరు పక్షాల వారికీ సర్దిచెప్పారు. ఈ కారణంగా కాలువ కొలత సర్వే అర్థాంతరంగా నిలిచిపోయింది. మండల సర్వేయర్ తప్ప ఈ సమస్య పరిష్కారం విషయమై జిల్లా కలెక్టర్ నియమించిన కమిటీలోని ఇతర అధికారులు ఎవరూ రాలేదు. డ్రైనేజి శాఖ వారు వచ్చి దూరంగా ఉండిపోయారు. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు ఎవరూ రాలేదు.

CHANGE OF SURNAME

I, **MOHAMMAD SALIM** (Old Name), S/o. **MOHAMMAD SADIQ** Resident of 19-4-16, Kota Street, Opp. Bapuji Complex, Ongole, Prakasam District-523001, Andhra Pradesh, INDIA. I have changed my Surname from **MOHAMMAD SALIM to SHAIK MOHAMMED SALIM (New Name)** S/o. Mohammad Sadiq. Here after my name is known as **SHAIK MOHAMMED SALIM** as per affidavit dated **13-10-2025** before public Notary, Ongole.

CHANGE OF NAME

I, **SHAIK KARIMULLAH** (Old Name), S/o. **SHAIK MASTAN** Resident of 7-23-A1, Gandhi Street, Markapur, Prakasam District-523316, Andhra Pradesh, INDIA. I have changed my Name from **SHAIK KARIMULLAH to SHAIK KARIMULLA, (New Name)** S/o. Shaik Mastan. Here after my name is known as **SHAIK KARIMULLA** per affidavit dated **13-10-2025** before public Notary, Ongole.

PUBLIC NOTICE

Asper the instructions received from my client Gopavarapu Linga Reddy S/o Musalaiah, aged abut 44 years, Resident of Door No.1-57-1, Rachamitta Center, Chimakurthy Town, Chimakurthy Mandal, Prakasam District, I am hereby issuing this Public Notice for every one's information.

My client's son Gopavarapu Hema Varun Kumar Reddy was born on 07-06-2008 at Durga Nursing Home, Ongole and to that effect the Ongole Municipal Corporation has issued a Birth Certificate in his name. As per the said Birth Certificate the date of birth was mutated in the Records as 07-06-2008. My client's son has studied 10th class in NEXTGEN INTERNATIONAL SCHOOL, ONGOLE. The school Authorities issued Marks Memo vide No.28119490. In the said Marks Memo my son's date of birth was recorded wrongly as 07-06-2007 instead of correct date of birth of 07-06-2008.

Therefore, my client request the concerned Board Authorities to correct the 10th class marks memo of my client's son Gopavarapu Hema Varun and rectify the date of birth as 07-06-2008 and requested to issue certificate accordingly. The said matter is bring to the notice of Public through this Paper Publication.

Ongole
Date: 13-10-2025 **From**

Sunkara Venkata Rangaiah
Advocate
Opp. District Court Ground Floor,
Golden Towers, Ongole,
Prakasam District.
Cell No.99495 35789.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం: 163/2023

మైనేని వెంకయ్య చౌదరి .... ప్లైయింటిఫ్
వర్సెస్
తవనం వెంకట రామిరెడ్డి.............. డిఫెండెంట్

టు,
తవనం వెంకట రామిరెడ్డి, తండ్రి: లక్ష్మిరెడ్డి,
వయసు: 34 సం॥లు, హిందూ, పాల వ్యాపారం,
నివాసం: ఇడుపూరు గ్రామం,
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో, వాది ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం దావా వేసినారు. ఇందుకు సంబంధించిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ తీసుకొనలేదు. మీకు సమన్లు ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ:24-10-2025న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై మీ ఆక్షేపణలను పై కోర్టులో తెలుపు కొనవలెను. లేనిచో మీపరోక్షమందు తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

గెల్లి చౌదేశ్వరరావు
న్యాయవాది, మార్కాపురం

మహారాజశ్రీ
మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్. 6/2025

షేక్ రెహనా సుల్తానా .... అప్పిలెంట్
వర్సెస్
షేక్ ఇస్మాయిల్ (చనిపోయినందున) ఇతరులు
.... రెస్పాండెంట్లు

టు,
ఆర్-3) దూదేకుల పీరన్, తండ్రి: దిబ్బా సాహెబ్ ముస్లిం, నివాసం: డోర్ నెం: 10-104-ఎ2, చిన్న మసీదు వీధి, కంభం గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

నీ పైన, మరి కొంతమంది పైన అప్పిలెంట్ పై నెంబరు అప్పీలును దాఖలు చేసి ఉన్నది. ఈ అప్పీలు నందు కోర్టు వారి ద్వారా అప్పీలు నోటీసులు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నారు. కావున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా అప్పీలు నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 28-10-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఉన్నది. ఆ రోజు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 28-10-2025

ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి
అడ్వకేట్, మార్కాపురం.

గార్డియన్ నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 145/2025
in
O.S. No. 504/2024

Yakkali Srinivasa Rao .... Petitioner
V/s
Yakkali Venkateswara Raj
being died his L.Rs.
1. Yakkali Chitralekha
2. Yakkali Bhavani Sri Aradhya
.... Respondents

To :
1st Respondent :- Yakkali Chitralekha, wife of Late Yakkali Venkateswara Raj, aged about 32 years, Hindu, Housewife.
2nd Respondent :- Yakkali Bhavani Sri Aradhya, daughter of Late Yakkali Venkateswara Raj, aged about 2 years, being minor represented by her natural guardian and mother the 2nd respondent herein i.e., Yakkali Chitralekha.
Both are Residents of D.No.10-3-21-A, Near Vivekananda Vidhya Peetam, Near Reddy Mahila College, Markapur Town and Mandal, Prakasam District.

పై నెంబరు దావాలోని I.A. No. 145/2025 పిటీషను నందు 2వ రెస్పాండెంట్ యక్కలి భవాని శ్రీ ఆరాధ్య మైనర్ అయి ఉన్నందున, తల్లి అయిన నిన్ను మైనర్ గార్డియన్‌గా నియమించమని కోరుతూ పిటీషనర్లు పైకోర్టులో, పై నెంబరు పిటీషన్‌ను దాఖలు చేయగా, ఇందు విషయమై నీకు పలుమార్లు గార్డియన్ నోటీసులు పంపగా, అవి నీకు మట్టుని కారణం చేత ఈ దినపత్రిక గార్డియన్ నోటీసు ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 28-10-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం నీవు స్వయముగా లేదా నీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు I.A.No:145/2025 పిటీషన్‌ను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 28-10-2025

Aravapalli Srinivasa Rao,
Advocate for Petitioner,
Markapur, Prakasam Dist.
Cell No. 9248515151.

NOTICE u/o 21 RULE 54 (IA) CPC
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No : 9/2025
in
OS No : 3/2022

Between:-
బత్తిన కృష్ణారావు ...DHR
V/s
తిరుమలశెట్టి కృష్ణమూర్తి @ రామకృష్ణ ....JDR

To,
తిరుమలశెట్టి కృష్ణమూర్తి @ రామకృష్ణ
S/o చంద్రయ్య Retd HM ,R/o Gopi Mastar House, రమణయ్య బంకు వెనక,
పాపరాజు తోట, చీరాల, బాపట్ల జిల్లా.

పైనంబరు గల EPని మీపై దాఖలుచేసి మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 24-10-2025 ఉదయం 10-30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయంగా కాని వకీలు ద్వారా గాని పై కోర్టు వారి వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీపరోక్షమున పటిషన్ విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది: 24-10-2025. ఇట్లు

కర్రా యానీ గ్రేస్ ఫ్లారి
న్యాయవాది, పర్చూరు,చీరాల
సెల్ : 79812 20556

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన పశ్చిమ గోదావరి జిల్లా, నిడమర్రు మండలం, చిన నిండ్ర కొలను గ్రామ నివాసి అయిన కనుమూరు అజయ్, తండ్రి మురళీ కృష్ణంరాజు అను వారు నాకు ఇచ్చిన సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటుకు కురిచేడు గ్రామ సర్వే నెం.435 నందు య.7.75 సెంట్లు గల భూమి కలదు. అయితే నా క్లయింట్ సదరు భూమికి సంబంధించిన తే.05.11.2020 గల ఒరిజినల్ దఖలు దస్తావేజు నెం.4322/2020 గునుపూడి సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు మరియు తేది.27.01.2021 గల సవరణ దస్తావేజు నెం.429/2021 గునుపూడి సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు గల 2 దస్తావేజులను తే.08.10.2025 దీన ఫొటో స్టాట్ కాపీలు తీయించుటకు తీసుకువెళ్ళు క్రమములో ప్రకాశం జిల్లా, కురిచేడు మండలం & గ్రామం లోని అమ్మవారి గుడి వద్ద పోగొట్టుకోవడమైనది, అప్పటినుండి నా క్లయింటు సదరు దస్తావేజును ఎంత వెతికిననూ దొరికియుండలేదు. కావున ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పైన చెప్పబడిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల వెంటనే నా క్లయింటును వారి మొబైల్ నెం.9177764008 ద్వారా సంప్రదించి కాని లేక ఈ క్రింది చిరునామాకు సంప్రదించి అయినా ఇవ్వవలసిందిగా కోరడమైనది.

మానికొండ ఆదినారాయణ
అడ్వకేట్, బాలాజీ వెంచర్, దర్శి
సెల్ : 92474 23503

దరిశి
తేది:**11-10-2025**

మహారాజశ్రీ గౌరవనీయులైన ఫ్యామిలీ కోర్టు మరియు ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA No : 1457/2025
IN
OS No : 28/2023

Between
మారెడ్డి ఆంజనేయ రెడ్డి @ ఆంజనేయులు రెడ్డి
S/o అనంతారెడ్డి R/o డోర్ నెంబర్ :
1-3-57/10B గుజ్జనగుండ్ల గుంటూరు.... పిటిషనర్
మరియు
చోడా లత W/o లేట్ వెంకట కొండారెడ్డి
మరియు ఇతరులు .... రెస్పాండెంట్స్

To
R8) చెన్నా సాయి ముకేష్ S/o లేటు
చెన్నా చెంగల రావ్ R/o అద్దంకి బజార్,
కనిగిరి, కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబర్ దావాలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటిసు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు కనుక మీకు నోటీసు జారీ నిమిత్తం కోర్టువారు తేది 14-10-2025కి లో వాయిదావేసియున్నారు మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం గం 10.30 నిమిషాలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
M.V.V.S. వేణు గోపాల్
P.V.R. రాఘవరావు
న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ గౌరవనీయులైన ఫ్యామిలీ కోర్టు మరియు ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
OS No : 28/2023

Between
మారెడ్డి ఆంజనేయ రెడ్డి @ ఆంజనేయులు రెడ్డి
S/o అనంతారెడ్డి R/o డోర్ నెంబర్ :
1-3-57/10B గుజ్జనగుండ్ల గుంటూరు .... వాది
మరియు
చోడా లత W/o లేట్ వెంకట కొండారెడ్డి
మరియు ఇతరులు .... ప్రతివాదులు

To
D8) చెన్నా సాయి ముకేష్
S/o లేటు చెన్నా చెంగలరావ్
R/o అద్దంకి బజార్, కనిగిరి, కనిగిరి మండలం,
ప్రకాశం జిల్లా.

పైనెంబర్ దావాలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటిసు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు కనుక మీకు నోటీసు జారీ నిమిత్తం కోర్టువారు తేది : 14-10-2025కి లో వాయిదావేసియున్నారు మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం గం 10.30 నిమిషాలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
M.V.V.S. వేణు గోపాల్
P.V.R. రాఘవరావు
న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా

ప్రజాశక్తి 3
మంగళవారం 14 అక్టోబర్ 2025

ఆందోళన ఉధృతికి సన్నాహాలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్ అధికారులు సూచనలు పాటిస్తున్నా.. ఇప్పటివరకు సాఫీగా సాగుతున్న గ్రానైట్ పరిశ్రమ ఒక్కసారిగా కుదేలు అయింది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ నెట్టుకొస్తున్న పరిశ్రమను ఇక నడపటం సాధ్యం కాదని ఫ్యాక్టరీ యజమానులు సమ్మెకు దిగారు. రాష్ట్ర భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఫ్యాక్టరీ యజమానులకు సోమవారం కల్లా సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్ముకొని గత మూడు రోజులుగా ఫ్యాక్టరీ యజమానులు ఎదురుచూస్తున్నారు. కానీ సోమవారం దాటిపోయినా ఎలాంటి సమాచారం యజమానులకు అందలేదు. పరిష్కారం దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదని యజమానులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సమ్మె బాట పట్టాలని యోచిస్తున్నాయి. తమ సమస్యను మానవతా దక్పథంతో ఆలోచించకుండా తమపై ఒత్తిడి తెచ్చి బలవంతపు సీనరీ వసూలు చేయాలని చూడటం ఎంతవరకు సబబని యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటనలు చేస్తూ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.450 కోట్ల పైగా ఆదాయాన్ని సమకూరుస్తున్న గ్రానైట్ పరిశ్రమను ఏఎంఆర్ కార్పొరేట్ సంస్థకు అప్పగించడం ఎంతవరకు భావ్యమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యపై దష్టి పెట్టి, ఫ్యాక్టరీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా కషి చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయాలని యజమానులు భావిస్తున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు దొడ్డ శేషాద్రి. దొడ్డ రాజబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ స్మార్ట్ కార్డులను వీఆర్వో సచివాలయ సిబ్బందితో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డ. శేషాద్రి మాట్లాడుతూ ఈ వారం రోజుల్లో పంపిణీ తరువాత ఎవరైనా వీటిని అందుకోక పోతే అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆయా డీలర్ల షాపులు వద్ద అందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ కూడా ఎవరైనా మిగిలి ఉంటే మరలా సచివాలయ సిబ్బంది దగ్గరికి వెళ్లి తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లపునేని రమణబాబు, కామేపల్లి కృష్ణమూర్తి, అయినా ఆంజనేయులు, వడ్డే రాధాకృష్ణ, వీఆర్వో నాగేశ్వరరావు, వీఆర్ఏ గురవయ్య పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీశైలం దేవస్థానంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్, ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేసి తిరుగు ప్రయాణంలో కర్నూల్ వెళుతూ దోర్నాలలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధిని శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కాశీరావు లావణ్య దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని పూలమాల, శాలువాతో సత్కరించారు.

సొసైటీ ద్వారా నాణ్యమైన పురుగు మందులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు సొసైటీ ద్వారా రైతులకు నాణ్యమైన పురుగు మందులు అందించడానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని వ్యవసాయాధికారి పి వెంకట్రావు తెలిపారు. సోమవారం ఉప్పుగుండూరు సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పురుగుమందుల కౌంటరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటివరకు రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, డైరెక్టర్లు పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, సిఇఓ కోటి, జి బసవపున్నయ్య, పిడిసిసి బ్యాంకు మేనేజరు ఎస్ శ్రీకాంత్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు మనోజ్ కుమార్, ఎం సత్యనారాయణ, టి శ్రీకాంత్, కనగాల రామకృష్ణ, చిన్న, బంగారు బాబు, త్యాగరాజు, జాన్సన్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఉద్రిక్తత

లారీ డ్రైవర్‌పై యజమాని దాడితో ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం

లారీ డ్రైవర్ మద్యం సేవించాడని ఆ లారీ యజమాని దాడికి దిగిన సంఘటన మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలు ఇలా... లారీ డ్రైవర్ మద్యం సేవించాడనే కారణంగా ఆ లారీ యజమాని దాడి చేసిన సంఘటన చీమకుర్తిలో జరిగింది. ఈ దాడిలో డ్రైవర్ నారాయణకు గాయాలయ్యాయి. పొదిలి ప్రాథమిక వైద్యశాలలో చికిత్సలు పొందారు. పొదిలి నుంచి బయలుదేరిన నారాయణ మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. డ్రైవర్ నారాయణకు అండగా సిఐటియు మార్కాపురం పట్టణ అధ్యక్షుడు పి రూబెన్ నిలిచారు. నారాయణపై దాడి చేసిన లారీ యజమానిపై కేసు నమోదు చేయాలని పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబుకు విన్నవించారు. ఫిర్యాదు తీసుకోవడంలో కొంత జాప్యం జరిగింది. దీంతో సిఐటియు నేత రూబెన్ పట్టణ ఎస్ఐ సైదుబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో రూబెన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్ నారాయణ, సిఐటియు నేత రూబెన్‌లకు మద్దతుగా సుందరయ్య కాలనీ జనం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నిలిపివేయాలని వచ్చిన పోలీసులతో సుందరయ్య కాలనీకి చెందిన యువకులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అదనపు బలగాలను నియమించాల్సిన పరిస్థితి వచ్చింది. సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ అటు పోలీసులతో ఇటు ఆందోళనకారులతో వాగ్వాదాన్ని పరిష్కరించేలా మధ్యవర్తిత్వం నడపడంతో ఆందోళన ముగిసింది.

బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతా: సర్పంచి

ప్రజాశక్తి-టంగుటూరు

బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమవంతు సహకారం అందిస్తానని కారుమంచి గ్రామ సర్పంచి మన్నం శ్రీనివాస్ తెలిపారు. గ్రామ బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీ సమావేశం గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం సచివాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలల పరిరక్షణ విభాగం నుంచి బాలల రక్షణ అధికారి శ్రీలక్ష్మి, బంగారు బాల్య కమిటీ సభ్యులు, స్వప్న హాజరయ్యారు. పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న కనీసం సేవల గురించి విద్య, వసతికి, రక్షణకు సంబంధించిన వివరాలు శ్రీలక్ష్మి తెలియజేశారు. బంగారు బాల్య కమిటీ సభ్యులు స్వప్న మాట్లాడుతూ బాల్య వివాహం చేయటం వల్ల పిల్లలకు కలిగే ఆరోగ్య సమస్యల గురించి,

బంగారు బాల్యం బ్రోచర్ పట్టుకున్న సర్పంచి శ్రీనివాస్

అనర్ధాల గురించి, అటువంటి వివాహం జరిపించిన వారికి శిక్షల గురించి వివరించారు. గ్రామ సచివాలయం సెక్రటరీ కె స్వర్ణకుమార్, మహిళా పోలీస్, బాలల రక్షణ అధికారి, బంగారు బాల్యం కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రజాశక్తి-కొండపి

ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలతో అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ అన్నారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ యూనిట్లలో ఏటీఎం మోడల్ ద్వారా పండించిన పంటలను విక్రయించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మాధవ, ఐసిఆర్పీలు గౌతమి, తిరుమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరులో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గిద్దలూరు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేవివి, ప్రజా సంఘాల నాయకులు

కౌమార దశలో ఉన్న ఆడపిల్లల శరీరంలో సంభవించే మార్పుల గురించి అవగాహన కలిగించేందుకు డాక్టర్ మీసరగండ రమాదేవి రచించిన 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు, పుస్తక కేంద్రాలు ప్రజా చైతన్యానికి దీపిక లాంటివి అని, పుస్తకాలు చదవడం అంటే గత చరిత్రను గుర్తుంచుకోవడమేనని అన్నారు. పుస్తక పఠనం ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని, పుస్తక పఠనం అనేది ఒక వ్యసనంలా ఉంటే మంచిదని అన్నారు. ఇతర అనేక వ్యసనాల వల్ల ఆరోగ్యం పాడైతే, ఈ వ్యసనం వల్ల మెదడు మరింత చురుగ్గా తయారవుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటర్నెట్ అభివృద్ధి చెందిన ఈ కాలంలో పుస్తకం చేతిలో ఉంటే మంచి గౌరవం దక్కుతుందన్నారు. పుస్తకాలు చదివితేనే సమాజాన్ని చదివినట్లవుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి స్వరూపరెడ్డి మాట్లాడుతూ గాలి, సూర్యచంద్రుల కాంతి ఎంత సులభంగా, సహజ సిద్ధంగా అందరికీ అందుతుందో విజ్ఞానం కూడా అలాగే అందాలని అన్నారు. స్థానిక విశ్వ భారతి హై స్కూల్ ఆవరణలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఆచార్యులు సూరం నారాయణ రెడ్డి, సామాజిక విశ్లేషకులు టి ధనుంజయ రెడ్డి, సాయి చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి రంగస్వామి రెడ్డి, విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, గిద్దలూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి రవీంద్రనాథ్ రెడ్డి, పాతాళ నాగేశ్వర స్వామి మాజీ చైర్మన్ శివాపురం ఆంజనేయులు, జన విజ్ఞాన వేదిక నాయకులు డి వెంకటేశ్వర్లు, జి శ్రీనివాస్‌రెడ్డి, ఏ విశ్వరూపం, ఏ అల్లూరయ్య, వి వెంకటేశ్వర్లు, పి మల్లికార్జున, యుటిఎఫ్ నాయకులు పి రమణారెడ్డి, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ఎస్ జై చంద్రారెడ్డి, ఎస్ మధుసూదన్‌రెడ్డి, సిఐటియు నాయకులు, టీ ఆవులయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన యువకులు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మోటార్ సైకిల్

ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల / మార్కాపురం

కొనకనమిట్ల మండలంలోని ఎదురాళ్లపాడు - చౌటుపల్లి 565 జాతీయ రహదారిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. మృతులు మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామానికి చెందిన యువకులు గణేష్ (20), అబినాష్(22)గా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి: ఎంఈవో

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పాఠశాల విధులలో నూతనంగా సోమవారం చేరిన ఉపాధ్యాయులకు ఎంఈఓ బి మస్తాన్‌నాయక్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం వృత్తి కాదని, నవ సమాజాన్ని తయారు చేసే బాధ్యత మీ మీద ఉందని గుర్తు చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టబోయే ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని, మండలానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. తదనంతరం ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిన 12 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొద్దు నాగేశ్వరరావు, బి రామకృష్ణ నాయక్, మందగిరి వర్ధన్ పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగస్తులకు మెడికల్ క్యాంప్‌ను స్థానిక ఎస్ఎస్ ప్లాజాలో సోమవారం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు బ్యాంక్ చీఫ్ మేనేజర్ జక్కుల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఆదాం పాల్గొని మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ ఉద్యోగుల సేవలు విలువకట్టలేనివని అన్నారు. అలాగే కస్టమర్లకు అనేక సేవలందించిన మీరు మీ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ దీర్ఘకాలిక వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ పదవీ విరమణ చేసిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రోత్సహించడంలో వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ వైద్య శిబిరంలో పలు రకాల వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఇంటెలెక్ట్ డిజైన్ ఏరినా కార్పొరేట్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తమ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 220 ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న బాలబాలికలకు స్కాలర్‌షిప్ అందిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం శింగరాయకొండ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరియు శానంపూడి ఉన్నత పాఠశాలలోని ఎంపిక కాబడిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఉల్లాస్ ట్రస్ట్ తరుపున డెలివరీ మేనేజర్ దింటకుర్తి బాలకృష్ణ, హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఆయుష్మాన్ భారత్ కార్డులు పేరుతో సచివాలయాల్లో క్యాంపు నిర్వహిస్తూ ఒక్కొక్కరి నుంచి రూ.100 వసూలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. కమిషనర్ కె సాంబశివరావుకు వింత పత్రం అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఉచితంగా చేయవలసిన ఆయుష్మాన్ భారత్ కార్డు పంపిణీని కొందరు అక్రమార్కులు డబ్బు వసూలు చేయడం బాధాకరమని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన పేదలకు రూ.5లక్షల వరకు వైద్యం కోసం పిఎంజెఎవై కింద జారీచేసే గుర్తింపు కార్డు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బాధ్యతతో ఇప్పటికే జిల్లాలో అనేక మందికి ఆశాలు, ఎఎన్ఎంల ద్వారా ఉచితంగా అందించారని తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ పొందలేరని అబద్ధాలు ప్రచారం చేసి ప్రతి మనిషి నుండి

వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

రూ.100 వసూలు చేస్తున్నారని అన్నారు. కుటుంబలో నలుగురుంటే రూ.400 చొప్పున వెయ్యి మందిపైన పేదలు దగ్గర వసూలు చేశారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పేరుతో వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటివరకు తీసుకున్న డబ్బు లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు, బాధితులు కె రమేష్, డి కృష్ణ ప్రసాద్, జి డానియల్, ఎం సూర్య, వై నవీన్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

కౌలు రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు శ్రీనివాసరావుకు కౌలు రైతు సంఘం నాయకులు సోమవవారం వినతి పత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు కౌలు రైతులకు జమ చేయాలని కోరారు. నూతన కౌలు చట్టం తీసుకురావాలని అన్నారు. పొగాకు రైతులకు రావలసిన డబ్బులు ఖాతాల్లో వేయాలని, సరిపడునంత యూరియా సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని అన్నారు. పాత చట్టం దుర్మార్గమైనదని, ఆచట్టంలో లోపాలు సవరిస్తామని, తాము అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడాదిన్నరైనా ముసాయిదా చట్టం చేయలేదని అన్నారు. ఈ చట్టం ద్వారా కౌలు

తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న కౌలు రైతులు

రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వాస్తవంగా పంటలు పండించే రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయం అవసరమని అన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి భాను ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులు పెట్టుబడుల కోసం ధనికుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని అన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు వంట రుణాలు ఇవ్వడంలో లోపం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు అంజయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

గత నెల19, ఈనెల 8, 9, 10 తేదీల్లో పందిళ్ళపల్లి, కొలలపూడి, ఇంకొల్లు జెడ్పి హైస్కూళ్ళలో నిర్వహించిన 69వ ఎస్‌జిఎఫ్ ఆటల పోటీల్లో పందిళ్ళపల్లి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తలమల దీప్తి సోమవారం తెలిపారు. అండర్ -17 విభాగంలో హైజంప్‌లో సందీప్, హేమర్ త్రోలో హేమ నాగసాయి, వెంకటేశ్వర్లు, పూజిత, లాంగ్ జంప్‌లో ఆదిలక్ష్మి, వాలీబాల్‌లో సందీప్, రవితేజ, సిద్దు, కబడ్డీలో సందీప్, సిద్దు, షటిల్ బ్యాడ్మింటన్‌లో పూజిత, ఖోఖోలో డేని లక్ష్మణ్, అండర్ 14 విభాగంలో 400, 600 మీటర్స్ రన్నింగ్‌లో ప్రియానిఖిత, హైజంప్‌లో రత్నకుమార్, షటిల్ బ్యాడ్మింటన్‌లో కార్తికేయ, జ్యోత్స్న

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం టి దీప్తి

ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తలమల దీప్తి, స్టాఫ్ సెక్రటరీ బుద్ధి మోహనరావు, అంకయ్య, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పిఇటిలు కర్ణ నాగేశ్వరరావు, తోట. వెంకటేశ్వర్లును అభినందించారు.

ఆన్‌లైన్ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ అధికారిక అనుమతితో ఎడ్యుకేషనల్ ఎపిఫని అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రతిభా పరీక్ష ఈఈఎంటి 2026 నోటిఫికేషన్ ఎంఇఒ కెవి శ్రీనివాసరావు, ఎపిఫని కన్వీనర్ పుట్టంరాంజు శ్రీరామచంద్రమూర్తి సోమవారం విడుదల చేశారు. పాఠశాల విద్యా సంచాలకులు వి విజయ రామరాజు అనుమతి మంజూరు చేశారు. డిసెంబర్ 2025 నెలలో రెండు దశల్లో ప్రిలిమ్స్, మైన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 7నుండి 10వ తరగతి విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. అక్టోబర్ 15 నుండి నవంబర్ 14 వరకు ఆన్‌లైన్‌లో ధరకాస్తు

ప్రతిభ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఇఒలు

చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ 6 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించి డిసెంబర్ 7 ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు. డిసెంబర్ 27న మెయిన్స్ పరీక్ష నిర్వహించి జనవరిలో ఫలితాలు ప్రకటిస్తామని, ఫిబ్రవరి 1న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

బెదిరింపులను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - హెచ్‌ఎంపాడు

భారతదేశంపై అమెరికా సుంకాల బెదిరింపులను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. భారత్‌పై ట్రంపు సుంకాల యుద్ధంపై సిపిఎం ప్రచురించిన పుస్తకాన్ని స్థానిక అంబేద్కర్ ప్రాంగంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కత్తి ఏబు, ఆంద్రా వినయ్, ధారా నాగార్జున, యెహోషువ, రాములు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి

ప్రతి అర్జీనీ పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే వినతులను సంపూర్ణంగా పరిష్కరిస్తామని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి తెలిపారు. అర్జీదారుల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించారు. ఐదు అర్జీలు స్వీకరించామని తెలిపారు. అర్జీలను సంబంధిత అధికారులు విచారించి పరిష్కరించాలని సిఫార్సు చేసినట్లు తెలిపారు.

ఆశీర్వదిస్తున్న టిడిపి నాయకులు

చిన్నారికి టిడిపి నేతల ఆశీర్వాదం

ప్రజాశక్తి - పామూరు

మండలంలోని కంబాలదిన్నెలో నల్లబోతుల శీను కుమార్తె పుష్పాలంకరణ వేడుకల్లో టిడిపి నాయకులు పాల్గొని అక్షింతలతో దీవించారు. కార్యక్రమంలో కనిగిరి ఎఎంసి చైర్మన్ యారవ శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య, మన్నం రమణయ్య, గోళ్ల వీరబాబు, అమీర్ బాబు, ఇ కోటిరెడ్డి, కంబాలదిన్నె మాజీ సర్పంచ్ గోళ్ళ మాల్యాద్రి, ఏలూరి నరసింహ, ఏలూరి మాధవరావు, ఇ శ్రీనివాసులురెడ్డి, గోళ్ల రమణయ్య, గోళ్ల వీరాంజనేయులు, కుతారి బ్రహ్మయ్య, మల్లెల శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాజరైన వారికి పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేలా అవగాహన కల్పించడం ద్వారా తగు చికిత్స తీసుకొని వ్యాధిని నయం చేయవచ్చని ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ గార్గేయి తెలిపారు. రోటరీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ భాను చంద్ర నాయుడు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, తాళ్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రధానితో జిల్లా విద్యార్థి ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల, పంగులూరు

విద్యార్థి పవన్ గోపికృష్ణ

జిఎస్టి సేవింగ్స్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థికి ప్రధాని నరేంద్ర మోడీతో ముఖాముఖికి అరుదైన అవకాశం లభించింది. ఈనెల 7న విద్యా శాఖ నిర్వహించిన జిఎస్టి సేవింగ్స్ వ్యాసరచన పోటీల్లో జె పంగులూరు మండలం కొండ మంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సిహెచ్ పవన్ గోపికృష్ణ రాష్ట్రస్థాయికి ఎంపికై ఎంపికైనట్లు డిఇఒ ఎస్ పురుషోత్తం సోమవారం ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం పర్యటనలో భాగంగా కర్నూలులో నరేంద్ర మోడీతో ముచ్చటించే అవకాశం లభించిందని అన్నారు. విద్యార్థి గోపికృష్ణ ప్రతిభతో జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న పాఠశాల ఉపాధ్యాయ బృందానికి డీఈఒ, హెచ్‌ఎం ఐ అనిత అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్ పార్ట్ వన్ ఇంగ్లీష్ మీడియం స్టడీ మెటీరియల్ స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని పంగులూరు, బూదవాడ, కోటపాడు, కొండ మంజులూరు, కొండమూరు, రేణింగవరం, అలవలపాడు, చందలూరు గ్రామాల్లోని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయబోవు విద్యార్థులు 125 మందికి ఈ మెటీరియల్ అందజేశారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కె శ్రీనివాసరావు

మెషీన్ లెర్నింగ్‌పై వర్క్‌షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మెషీన్ లెర్నింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం తెలిపారు. డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్‌పై రెండు రోజుల వర్క్ షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. హైదరాబాద్ ఐసిఎఫ్ఎఐ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వర్క్ షాపు నిర్వహించినట్లు తెలిపారు. ఆధునిక కాలంలో కంప్యూటర్ ప్రపంచంలో మెషీన్ లెర్నింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తున్నదని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

వంశపారంపర్యంగా ఆయుర్వేద సాంప్రదాయ వైద్యులు అధికారికంగా గుర్తింపునకు వైద్యుల పేర్లు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని ఔషధ సుగంధ మొక్కల బోర్డు సీఈఓ ఆవుల చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది ఆయుర్వేద వైద్యం తెలిసిన వారు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వారంతా తమ వైద్య నైపుణ్య పత్రాలు జతచేసి ఈనెల 17న బాపట్లలో నమోదు జరుగుతుందని అన్నారు. దేశీయ వైద్య సంఘం నిర్వాహకులు విఎల్‌పి కుమార్‌ను 89785 52289 నెంబర్లో సంప్రదించాలని అన్నారు.

పొంగిన వాగు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ రజియా సుల్తానా

భారీ వర్షం.. పొంగిన వాగులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలో ఆదివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఉప్పుగుండూరులో మట్టిగుంటవాగు, నాగన్నవాగు, ఉప్పుగుండూరు, మాచవరం మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించాయి. అదేవిధంగా వర్షం పడితే వారం రోజుల పాటు బయట ప్రపంచం తెలియని కొత్తకోట హనుమాపురం తదితర గ్రామాలకు సంబంధించి ప్రమాదకరమైన కొత్తకోట వాగు ప్రవహించడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఇరువైపులా ఎస్ఐ రజియా సుల్తానా తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

కొండెపి మార్కెట్ కమిటీ తొలి సమావేశంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైతులకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం నాడు కొండెపి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం ప్రధాన కార్యాలయమైన శింగరాయకొండలో చైర్మన్ కర్ల తిరుపతమ్మ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముందుగా సమావేశంలో చైర్మన్ కర్ల తిరుపతమ్మ జామాయిల్ చెట్లు టంగుటూరు శింగరాయకొండ మార్కెట్ కమిటీ కార్యాలయాల్లో 30 సంవత్సరాల నుంచి వేయటం జరిగిందని వాటిని వేలం ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. దానికి కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. చైర్మన్ ఛాంబర్ మరమ్మతులు చేయడానికి నిధులు కావాలని కోరగా దానికి కూడా నిర్ణయం తీసుకున్నారు. అనంతరం. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పటి మార్కెటింగ్ శాఖ మంత్రిగా పనిచేసిన దామచర్ల ఆంజనేయులు హయాంలోనే ఈ మార్కెట్ కమిటీ అభివృద్ధి చెందిందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని వివరించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మామిడి చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జివి రవికుమార్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, కనుమళ్ల సొసైటీ చైర్మన్ బైరపనేని మోహన్‌రావు, వ్యవసాయశాఖ ఏడీ ఈతముక్కల నిర్మలకుమారి, తహశీల్దార్ రాజేష్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మించల బ్రహ్మయ్య, చీమకుర్తి కృష్ణ, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్శి ప్రసాద్‌రావు, కోట శ్రీనివాసరావు, కర్ల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

రమణమ్మ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న క్రిష్ణకిశోర్‌రెడ్డి

ప్రమాణ స్వీకారంలో క్రిష్ణ కిశోర్ రెడ్డి

ప్రజాశక్తి-కొమరోలు

నంద్యాల జిల్లా శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆశీర్వాదంతో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు సతీమణి బోనేని రమణమ్మను శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివార్ల దేవస్థానం శ్రీశైలం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతూ ఇంకా ఉన్నత స్థాయి పదవులు అందుకొని కొమరోలు మండల, గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సహకరిస్తూ మంచిపేరు, ప్రతిష్టలు తీసుకురావాలని కొనియాడారు. అనంతరం ఇరువురిని శాలువతో ఘనంగా సన్మానించారు. తదనంతరం బోనేని రమణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కొమరోలు టిడిపి మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండల పార్టీ అధ్యక్షులు మార్గాల సుబ్బారెడ్డి, గోన చెన్నకేశవులు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, పందనబోయిన భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సక్కుబాయమ్మకు మంత్రి స్వామి నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

దివంగత మాజీ దేవదాయ శాఖ మంత్రి దామచర్ల ఆంజనేయులు సతీమణి దామచర్ల సక్కుబాయమ్మ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, ఈదర ప్రభాకరరావు పాల్గొన్నారు.

సక్కుబాయమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రేషన్ కార్డుదారులకు క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మండల తహశీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఎంపీడీవో డి సురేష్ బాబు, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, వీఆర్వో పి వెంకటస్వామి తదితరులు పంపిణీ చేశారు. సంతనూతలపాడులో షాప్ నంబర్ 15కు సంబంధించి 445 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రంపతోటి అంకారావు అధ్యక్షత వహించగా సంతనూతలపాడు ఒకటో సచివాలయం విఆర్ఓ పి వెంకటస్వామి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్దన్, చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, ఆలయాల డైరెక్టర్లు ఆనాల శ్రీనివాసరావు, మద్దిరాల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు షేక్ నాయబ్, మట్టా పోలిశెట్టి, పావులూరి నారాయణస్వామి చౌదరి, కాలేషా, నజీర్, బాషా, అంబేద్కర్ సంఘం నాయకులు ఎడ్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పటి టీచర్స్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-88 బ్యాచ్ హైస్కూల్ (6 నుంచి 10వ తరగతి) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో సుదూర ప్రాంతాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. తమ అలనాటి అనుభవాలను పంచుకున్నారు. అప్పటి గురువు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మర్రి హరిముకుందారెడ్డిని పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి హరిముకుందారెడ్డి మాట్లాడుతూ ఎప్పటికైనా విద్యార్థులను కలపగలిగేది ఒక్క ఆత్మీయ సమ్మేళనమేనని, వారు తాము చదువుకున్న పాఠశాలను మరువరాదని, ఏదైనా మంచి పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు పది వేల విలువ గల బీరువాను బహూకరించారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన పూర్వ విద్యార్థి, ప్రస్తుత టీచర్ పాకల వెంకటేశ్వర్లరావు మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న తాను, ఇక్కడే ఉపాధ్యాయునిగా పనిచేసే భాగ్యం కలగడం ఎంతో అదృష్టదాయకమని అన్నారు.

ఉత్తమ శిక్షకుడిగా రవిచంద్రకుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

రవిచంద్రకుమార్‌కు సత్కారం

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం రవిచంద్రకుమార్ 'మోటివేషనల్ స్పీకర్'గా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో 'హోటల్ కత్రియా'లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ (వ్యక్తిత్వ వికాస శిక్షణ) వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ ఆదినారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. సైకాలజిస్ట్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మార్కాపురం పట్టణంలోని జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రవిచంద్రకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రవిచంద్రకుమార్‌కు ఉత్తమ ప్రతిభ అవార్డు, బ్యాడ్జి, సర్టిఫికెట్‌ను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ ఆదినారాయణరెడ్డి, నేషనల్ బోర్డ్ అధ్యక్షులు మాధవి, ఉపాధ్యక్షులు రాజేశ్వరి, రీజనల్ అధ్యక్షులు చక్రవర్తి, కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి పట్టణంలో బీసీ కాలనీ, ఇస్లాంపేట, ప్రకాష్ నగర్ ప్రజల సౌకర్యార్థం రెండు రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని సోమవారం ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు తహశీల్దార్‌కు విన్నవించారు. పొదిలి ఏఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ మూడు ప్రాంత ప్రజలు తమ రేషన్ కష్టాలను తెలియజేస్తూ తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తప్పకుండా మీ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షాహిదా, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు మౌలాలి పాల్గొన్నారు.

మనువాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

జస్టిస్ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై దాడే • వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మనువాదులు, మతోన్మాదుల ప్రమాదం నుంచి రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ మండలంలోని బి మాచవరంలోని అంబేద్కర్ భవన్లో సోమవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జస్టిస్ బిఆర్ గవాయి ప్రధాన న్యాయమూర్తి కావడం మనువాదులకు ఏమాత్రం మింగుడు పడని అంశమని అన్నారు. ఆయన కుటుంబం మీద, ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడ్డారని, వివరకు బరితెగించి కోర్టు వెలుపల పరిష్కరించుకోవలసిన విషయం కోర్టులో చర్చ చేసి, ఆయనపై బూటు విసిరారు అంటే ఎవరి అండతో

సభలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ఇటువంటి దశ్చర్యలకు పాల్పడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారికి ప్రభుత్వం అండగా ఉండటం ఫలితంగానే ఇటువంటివి పెచ్చరిల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదుల చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ప్రతిఘటించాలని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజాన్ని అనాగరిక స్థితిలోకి తీసుకెళ్లే భావజాలన్ని పాలకులే ప్రచారం చేయటం సిగ్గుచేటని అన్నారు. సభకు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అడ్డగబోట్టు నరసయ్య, సుదర్శి నరసింహం, దాసరి సింగారావు, ప్రేమల సింగయ్య, దారా సుబ్బారావు, కోతి అంజయ్య, అన్నవరపు కోటేసు, కే అంకమ్మరావు, పి వెంగయ్య, ఏ అంజిబాబు, నూతలపాటి శ్రీను, పులగర కోటేసు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆడపిల్లల పట్ల ఉన్న దురభిప్రాయాలు పూర్తిగా రూపుమాపాలని వైద్య ఆరోగ్య జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్, పిసిపిఎన్ డిటి యాక్ట్, బేటి బచావో బేటి పడావో అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ వెంకట పద్మావతి, డిప్యూటీ డెమో బి మరియమ్మ, డిప్యూటీ హెచ్ఈ అరుణ, మాధవి, హెచ్‌వి సుధారాణి, స్టాఫ్ నర్సు మేరీ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పామూరు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పట్టణం, ఇరువురు రోడ్డు, గోపాలపురం, కరెంట్ ఆఫీస్ కాలనీ, ఆవులవీధి వార్డుల్లో కార్డులు పంపిణీ చేశారు. శాసన సభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు రేషన్ కార్డులు కనిగిరి ఎఎంసి చైర్మన్ యారవ రమ శ్రీనివాస్ ప్రారంభించారు. డివివపల్లి, కంబాలదిన్నె, పామూరు పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, సింగిల్ విండో అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్, నర్సింగ్ సాంబశివరావు, అంచూరి వెంకటరెడ్డి, పాలపర్తి రమణయ్య, నరసింహారావు, బండ్ల నారాయణ, కావేటి రసూల్, షేక్ ఖాజా, రహమతుల్లా, కోడిగుంపల నాయిబ్ రసూల్, షేక్ ఖజా మొద్దీన్ (సలాం), ముబీనా, మౌలాలి, విఆర్ఓ మనోజ్ కుమార్, చల్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-దర్శి

నకిలీ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని బ్రాందీ షాపుల్లో సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్రంలో కల్తీ మద్యం జరుగుతుందని, ప్రభుత్వం కల్తీ మద్యం నివారణకు చర్యలు చేపట్టిందని అన్నారు. 11 నెలల్లో 118 బెల్ట్ షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐలు సత్యనారాయణ, యాసిన్ షరీఫ్ పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్లగట్టు, పాతపాడు మార్గంలో ఆర్టిసి బస్సులు పాఠశాల సమయానికి లేకపోవడంతో ఆటోలో పరిమితికి మించి నిలబడి విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. అదుపు తప్పిందంటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గొట్లగట్టు ఉన్నత పాఠశాలకు పాతపాడు, గరిమెనపెంట గ్రామాల నుంచి విద్యార్థులు నిత్యం ఆటోలో ముండ్లమూరు వస్తున్నారు. ప్రమాదమని తెలిసిన తప్పని పరిస్థితిలో వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు అంటున్నారు.

త్రోబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-దర్శి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్19 త్రోబాల్ బాల, బాలికల ఎంపిక 9న చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీలలో చందలూరు పాఠశాల 9, 10వ తరగతికి చెందిన కె విన్నుబాబు, ఎం యశ్వంత్, ఆర్ ప్రేమ్, ఎస్ సతీష్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంధం గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యాకమిటీ చైర్మన్ పి బాలనరసింహులు అభినందించారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు బహుమతులు సోమవారం అందజేశారు. గత శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ ఆధ్వర్యంలో వ్యాస రచన, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలకు ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత అధ్యక్షత తహశీల్దారు రవి కుమార్ బహుమతులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ గోపి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కల్తీ మద్యం అరికట్టాలని వైసిపి నిరసన

బాపట్లలో వైసిపి నాయకుల నిరసన ర్యాలి

అద్దంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి కార్యకర్తలు

వేమూరులో వైసిపి నాయకుల నిరసన ర్యాలి

ప్రజాశక్తి - బాపట్ల

అక్రమంగా తయారు చేసిన నకిలీ మద్యం లైసెన్స్ కలిగిన బ్రాందీ షాపులకు సరఫరా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వైసిపి నాయకులు కోకి రాఘవరెడ్డి ఆరోపించారు. అక్రమ మద్యం విక్రయదారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి సూచనల మేరకు జరిగిన నిరసనలో వైసిపి నాయకులు కాగిత సుధీర్ బాబు, కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపీపీ చిన్ని పోతుల హరిబాబు పాల్గొన్నారు.

పర్చూరులో ర్యాలి నిర్వహిస్తున్న వైసిపి కార్యకర్తలు

పర్చూరు : రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఒక కుటీర పరిశ్రమలాగా అన్ని ప్రాంతాల్లో తయారు చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వ మద్యం విధానానికి వ్యతిరేకంగా వైసిపి ఇంచార్జి గాదె మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి అనిల్ చౌదరి, బి ప్రభాకర్, చిన్నా నాయక్, జంపాని వీరయ్య చౌదరి, కటారి అప్పారావు, చిన్ని పూర్ణారావు, వెంకట సుబ్బారావు చౌదరి, పాదర్తి ప్రకాష్, అడకా గంగయ్య, అట్లూరి జైపాల్, అట్లూరి కృష్ణారావు, బుజ్జి నాయక్ పాల్గొన్నారు.

అద్దంకి : వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నకిలీ మద్యంకు నిరసనగా పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జ్యోతి హనుమంతరావు, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

నగరంలో అర్జీ ఇస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్

నగరం : రాష్ట్రంలో నకిలీ మద్యం విక్రయాలపై సిబిఐ విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. ప్రధాన కూడలి నుండి ప్రోహిబిషన్ స్టేషన్ వరకు వైసిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ మార్తూరి శ్రీరామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిమట బాలాజీ, చిత్రాల ఒబేదు, ఇంకొల్లు రామకృష్ణ, నిజాంపట్నం కోటేశ్వరావు, లోక బాపనయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి యార్లగడ్డ మదన్‌మోహన్, యువజన కన్వీనర్ డి కొండలురెడ్డి పాల్గొన్నారు.

చీరాల : నకిలీ మద్యం వ్యాపారానికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు సూచనలతో నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు, మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు పాల్గొన్నారు.

వేమూరు : నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అధ్యక్షతన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దర్శి : శాసనసభ్యులు, వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా సోమవారం స్థానిక ఎక్సైజ్ ఆఫీసు వద్దకు ర్యాలీ నిర్వహించారు. సిఐకి వినతి పత్రం అందజేశారు. వైసిపి అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కెవి రెడ్డి, మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నకిలీ మద్యం ఏరులై పారుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి తాళ్లూరు, ముండ్లమూరు అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షులు ముత్తినీడి సాంబ, కురిచేడు, ముండ్లమూరు జడ్‌పిటిసిలు నుసుం నాగిరెడ్డి, రత్నరాజు, కోరే సుబ్బారావు, నలదిమ్ము రమణారెడ్డి, మజునవలి, అన్నవరపు రవి, రవీంద్రారెడ్డి, మెడగం బాలకృష్ణరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కనిగిరి : నకిలీ మద్యం విక్రయాలు నిరసిస్తూ వైసిపి శ్రేణులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైసిపి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాలపై చేపట్టిన నిరసన ర్యాలీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ నివాసం నుండి ఒంగోలు బస్టాండ్ వద్ద ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, తమ్మనేని సుజాత రెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, చింతగుంట్ల సాల్మన్ రాజు, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, రాచపూడి మాణిక్యరావు పాల్గొన్నారు.

దర్శిలో వినతి పత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

చీరాల ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసిపి

కనిగిరిలో నిరసన ర్యాలీ చేపట్టిన వైసిపి నాయకులు

దుద్దుకూరు ఎర్ర వాగు పరిశీలిస్తున్న తహశీల్దారు, ఎస్ఐ

ఉధృతంగా దుద్దుకూరు వాగు ప్రవాహం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఎగువున కురిసిన వర్షాలకు మండలంలోని దుద్దుకూరు ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో తహశీల్దారు ఎస్‌విఎస్ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్ వాగును సందర్శించారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా రాకపోకలు నిలిపివేశారు. ఇంకొల్లు నుండి దుద్దుకూరు, రాసపూడి మీదగా ఒంగోలు వెళ్లే బస్సు ప్రయాణాలు ఆగిపోయాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారాగ ఏర్పాటు చేశారు. వాగు ఉధృతి తగ్గిన అనంతరం రాకపోకలు కొనసాగించవచ్చని తెలిపారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ డి ఈశ్వరమ్మ, తహశీల్దార్ ఎ సురేష్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ప్రజలు, షాపు యజమానులకు తగ్గించిన సూపర్ జిఎస్టిపై అవగాహన ర్యాలి నిర్వహించారు. నిత్యవసర సరుకులు తదితర వస్తువులపై జిఎస్టి తగ్గించడం వరమని, తగ్గిన జీఎస్టీని ప్రజలు, షాపులు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని జాండ్రపేటలో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి తనకు అందిన సమాచారంతో దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,500 నగదు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ సుబ్బారావు మాట్లాడుతూ ఎక్కడైనా పేకాట, కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.



చందోలు బండ్లమ్మ ఆలయ నూతన కమిటీ

బండ్లమ్మ ఆలయ విశిష్టత కాపాడాలి

ప్రజాశక్తి - బాపట్ల

చరిత్ర ప్రాశస్త్యం గల చందోలు బండ్లమ్మ అమ్మవారి దేవస్థాన నూతన కమిటీ ఎన్నిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో సోమవారం దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించారు. నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ విశిష్టత కాపాడేందుకు కృషి చేయాలని అన్నారు. కలకోట చక్రధరెడ్డి, కె నాగవేణి, ఎవి పద్మజ, ఎన్ సముద్రాలు, వెంకటప్పయ్య, ఎ ఉషారాణి, కె పట్టాభిరామారావు, కె అశోక్, కె శివలీలా, వి ప్రసాద్, సిహెచ్ రాంబాబు, డి బాలాజీరెడ్డితో కూడిన నూతన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో ఈఓ ఘంటసాల నరసింహమూర్తి, అఫ్జల్, కనుమూరి సాంబమూర్తి రాజు, వెంకటపతిరాజు, శైవ క్షేత్రం కమిటీ చైర్మన్ పరిమి రామకృష్ణ, సాయిబాబు, చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఇందూరి సాయిగుప్తా పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

సిజెఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - బాపట్ల

సిజెఐ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్చార్జి మంద పెంచలయ్య అన్నారు. సిజెఐపై దాడికి నిరసనగా పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ సూచనల మేరకు ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చీల్ రోడ్డు సెంటర్ నుండి నల్లజెండాలతో కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడారు. సిజెఐపై దాడికి తెగబడిన దోషులను వెంటనే విచారణ ద్వారా శిక్షించాలని అన్నారు. దేశంలో దళితులు దళిత అధికారులపై దాడులు పునరావృతమైతే ఈనెల 23న అమరావతిలో జరిగే భారీ నిరసన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ట్రేడుల్లోని ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి ఉమామహేశ్వరిదేవి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులు ఈ నెల 16లోపు iti.ap.gov.in ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.43 లక్షలు

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,43,998 ఆదాయం వచ్చినట్లు ఈఓ గిరిరాజు నరసింహ బాబు తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్లు అమ్మకం ద్వారా రూ.86,520, స్వామి వారి లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.29,660, శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.76,722, పంచామృత అభిషేకంనకు రూ.33,096, శ్రీపాద కానుకల ద్వారా రూ.18వేలు వచ్చినట్లు చెప్పారు.

పనులు పర్యవేక్షిస్తున్న డిఇ సుబ్బారావు

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి - కారంచేడు

చీరాల, కారంచేడు మధ్య ఉన్నటువంటి రొంపేరు కాలువలో గత కొంతకాలంగా నీటిపారుదలకు అడ్డుగా ఉన్న గొర్రెపోడెక్క తొలగించే పనులు డ్రైనేజీ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఎగువ నుంచి వస్తున్న వర్షాలకు రొంపేరు కాలువ నీరు పెరిగిపోయి. నేలబారుగా ఉన్న కాజు వే బ్రిడ్జిల వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయి నీటిపారుదలకు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. డ్రైనేజీ డిఈ సుబ్బారావు దగ్గరుండి పరిరక్షిస్తున్నారు. దీంతో కాలవలోని గుర్రపు డెక్క చిన్నచిన్న బ్రిడ్జిలు వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో నీటిపారుదలకు ఆటంకం ఏర్పడిందని, ఆ ప్రాంతంలోని రైతుల పొలాలు ముంపు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేపిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగిస్తున్నట్లు డీఈ సుబ్బారావు ప్రజాశక్తికి తెలిపారు.

ఉపాధ్యాయులుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-తాళ్ళూరు

ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మంది సోమవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నట్లు స్థానిక ఎంఇఓ గురిజాల సుబ్బయ్య తెలిపారు. ఆయా పాఠశాలల్లో బాధ్యతలు తీసుకోవడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

కెకెమిట్లలో నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎంఇఓలు

ప్రజాశక్తి - కొనకనమిట్ల

2025 మెగా డిఎస్సిలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన 26 మందికి సోమవారం ఎంఆర్‌సి కార్యాలయంలో నియామక పత్రాలు ఎంఇఓలు ఎస్‌కె డాంగేషరీఫ్, బరిగే నర్సింహారావు అందజేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సర్టిఫికెట్‌లను పరిశీలించి ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఉంటారని, వారిని దృష్టిలో ఉంచుకొని విద్యాబోధన చేయాలని సూచించారు. మంచి విద్యార్థులుగా తీర్చిదిద్ది పాఠశాలకు, విద్యాశాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పి శ్రీనివాసరెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్‌హై పాల్గొన్నారు.

సిఎస్‌పురం రూరల్ : మండలంలోని అంబవరం, డిజిపేట, సిఎస్ పురం, శీలంవారిపల్లి, నల్లమడుగుల, కోవిలంపాడు, పెద రాజుపాలెం, సీ నాగులవరం, పెద గోగులపల్లి, అరివేముల పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులను ఎపిటిఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జెఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, కె రామ సుబ్బారావు, కె చెన్నయ్య, జి రామక్రిష్ణ, చంద్రశేఖర్, జి హరిబాబు పాల్గొన్నారు.

పంగులూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు సోమవారం విధులకు హాజరయ్యారు. మండలంలోని పంగులూరు, బూదవాడ, చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులు హాజరైనట్లు ఎంఇఒ గోగుల వీరాంజనేయులు తెలిపారు. పంగులూరు పాఠశాలకు వల్లభరెడ్డి మధుసూదనరెడ్డి (ఎస్‌ఎ సోషల్), బూదవాడ పాఠశాలకు గాదె అశోక్‌రెడ్డి (ఎస్‌ఎపిఈ), చందలూరు పాఠశాలకు పిన్నక హరికృష్ణ (ఎస్‌ఎ సోషల్) సోమవారం విధులకు హాజరైనట్లు చెప్పారు.

పీసీపల్లి : ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన మండలంలోని 14 మంది నూతనంగా ఉపాధ్యాయుల విధుల్లో చేరినట్లు స్థానిక ఎంఈఓలు జి సంజీవ్, ఆర్ శ్రీనివాసులు తెలిపారు. 11 స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ముగ్గురు ఎస్జీటీలుగా విధుల్లో చేరినట్లు తెలిపారు. దీనివలన గతంలో పనిచేస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలు కోరుకుని కూడా వెళ్ళకుండా స్థానికంగా ఉన్నవారు ఇద్దరిని ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు నలుగురిని కోరుకున్న ప్రాంతాలకు రిలీవ్ చేశామని అన్నారు.

శుభాకాంక్షలు చెబుతున్న సిఎస్‌పురం నాయకులు

పిసిపల్లిలో విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

వర్షానికి తడిసిన మినుము పంట

ప్రజాశక్తి - పంగులూరు

బర్లీ పొగాకు సాగుతో పూర్తిగా నష్టపోయిన రైతాంగం, మినుము పంటతోనైనా కొంత నష్టాన్ని భర్తీ చేసుకోవాలనే ఉద్దేశంతో మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూత, పిందె రాలిపోవడమే కాకుండా కోత కోసిన మినుము తడిసి దేనికి పనికి రాకుండా పోయింది. మండలంలో 2200 ఎకరాల్లో మినుము సాగు చేశారు. ఎకరాకు రూ.20 నుండి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఈ సంవత్సరం మినుము మంచి దిగుబడి వచ్చి లాభాలు వస్తాయని రైతులు ఆశించారు. అయితే పైరు బాగా ఉండి పూత, పిందె వచ్చే దశలో వర్షాలు మొదలయ్యాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు వెయ్యి ఎకరాల్లో పైరు దెబ్బతింది. గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల మిగిలిన పొలాల్లో పూర్తిగా దెబ్బతినిపోయింది. కొంతమంది రైతులు మినుము పైరు కోశారు. ఓదే దశలో ఉండగానే మూడు రోజులుగా భారీ వర్షాలు కురిసాయి. ఈ దెబ్బతో ఓదేతో ఉన్న మినుము పైరు తడిసి దేనికి పనికి రాకుండా పోయింది. రైతాంగం పూర్తిగా నష్టపోయారు. ఎఒ డి సుబ్బారెడ్డి కొండమూరులోని మినుము పైరు పరిశీలించారు. ఓదెలపై ఉన్న పైరు తడిసిపోయిందని, కాయ తడిసిపోయి రెండు రోజుల్లో మొలక వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ వర్షం మినుముకు ఇబ్బంది కలిగించిందని చెప్పారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పైరు పరిశీలించి పంట నష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

విద్యార్థుల మృతి బాధాకరం

ప్రజాశక్తి - చీరాల

సముద్ర తీరం వద్ద రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఓడరేవు బీచ్ సమీపంలో సముద్రం అలలకు ఐదుగురు మృతి చెందిన సంఘటనపై ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుతో కలసి ఆయన పరిశీలించారు. రెవిన్యూ, అగ్నిమాపక, పోలీసు, మత్స్య శాఖల అధికారులు ఆదివారం గల్లంతైన యువకుల కోసం గాలిస్తున్నారని తెలిపారు. అధికారి శ్రీనివాస్ నాయక్, అగ్నిమాపక అధికారి నవీన్, తహశీల్దారు కె గోపి కృష్ణ ఉన్నారు.

ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహం

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు సముద్ర తీరంలో ఐదుగురు విద్యార్థులు గల్లంతై ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే గల్లంతైన మరో ఇద్దరు విద్యార్థుల మృతదేహాల కోసం పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై స్పందించిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదివారం అర్ధరాత్రి వాడరేవు తీరంకుని చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమరావతి వివిఐటి యూనివర్శిటిలో ఎంటెక్, బీటెక్ చదువుతున్న ముగ్గురు విద్యార్డులు శ్రీసాకేత్ (19), సాయి మణిదీప్ (18), జీవన్ సాత్విక్ (20) తీరంలో స్నానం చేస్తూ మృతి చెందారు. మరో ఇద్దరు కోసం గాలింపు చర్యలు చేస్తున్నామని అన్నారు. మృదేహాలు గాలించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 10వ తరగతి విద్యార్థి గౌతమ్ కృష్ణ ప్రసాద్ (15) మృతదేహం తీరం వద్దకు కొట్టుకు వచ్చింది. దింతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. బీటెక్ విద్యార్థి షారోను మృతదేహం కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

కాటసాని రవి (31)

మతిస్థిమితం లేని వ్యక్తి

మండలంలోని 167బి మైదుకూరు, సింగరాయకొండ జాతీయ రహదారిపై ఉప్పలపాడు బస్టాప్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్రిష్టంనాయుని పల్లికి చెందిన కాటసాని రవి (31) హైదరాబాద్‌కు వెళ్లేందుకు కాటసాని తిరుపతిరెడ్డితో కలిసి మోటార్ సైకిల్‌పై సిఎస్ పురం వస్తున్నారు. మతి స్థిమితం లేక తిరుగుతున్న ఓ వ్యక్తి ఉప్పలపాడు బస్ స్టాప్ సమీపంలో మోటార్ సైకిల్‌కు అడ్డుగా వచ్చాడు. దీంతో మతి స్థిమితం లేని వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న గుంటలో బోల్తా పడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న కాటసాని రవి, మతిస్థిమితం లేక తిరుగుతున్న వ్యక్తి ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మోటార్ సైకిల్‌పై ఉన్న రెండో వ్యక్తి కాటసాని తిరుపతిరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది కాటసాని తిరుపతిరెడ్డిని స్థానిక ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

బస్సు కావాలనే బ్యానర్‌తో మహిళల నిరసన

మా ఊరికి ఆర్టీసీ బస్సు కావాలి

ప్రజాశక్తి - బాపట్ల

మా ఊరికి ఆర్టీసీ బస్సు నడపాలని కర్లపాలెం మండలం పెదపులుగువారి పాలెంకు చెందిన మహిళలు స్థానిక కొత్త బస్టాండులో ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. పెద పులుగు వారిపాలెం నుండి బాపట్ల ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు వినియోగించు కోవడంతోపాటు ప్రజలు ఆర్టీసీ బస్సులో ప్రయాణం కొనసాగించే అవకాశం కల్పించాలని అధికారులు విన్నవించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండలంలోని అంబవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. 8ఏళ్లుగా ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. 12 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన పాఠశాలలో ఐదుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పూర్వ విద్యార్థులు పాఠశాలలో విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేసి విద్యా బోధనకు ఆటంకం కలగకుండా చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నలుగురు ఉపాధ్యాయులు నూతనంగా విధులు చేపట్టడంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా విధుల్లో చేరిన సోషల్, లెక్కలు, ఇంగ్లీష్, వ్యాయామ ఉపాధ్యాయులు రహమత్ భాష, బడే మియా, శ్రీనివాసులు, కరుణాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండూరు కొండయ్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి గుంటిమడుగు కృష్ణంరాజు, భైరవకోన ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ ముప్పాళ్ళ కృష్ణంరాజు, కమ్మనేతి వెంకటేశ్వర్లు, జయరామరాజు, మునిరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఒంగోలు స్ట్రగుల్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని, విద్యుత్ యాజమాన్యాన్ని కోరారు. సోమవారం సీఐటీయూ కార్యాలయం లో జరిగిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉమ్మడి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వల్లూరు సమీపంలో మినీ వ్యాన్ ప్రమాదంలో మృతి చెందిన చిత్తూరు సర్కిల్ అమలాపురం సెక్షన్ జూనియర్ లైన్‌మాన్‌కు సంతాపం తెలిపారు. మృతుని కుటుంబానికి విద్యుత్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన 14 మందికి మెరుగైన వైద్యసహాయం అందించేందుకు వెంటనే స్పందించిన ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు కు సమావేశం అభినందనలు తెలిపింది.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యాలు నిర్లక్ష్యధోరణి వీడి, పారిశ్రామిక పరిస్థితులు

స్ట్రగుల్ కమిటీ డిమాండ్

సమావేశంలో పాల్గొన్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

దెబ్బతినకుండా వెంటనే ఏపీ పవర్ జేఏసీ నాయకులతో చర్చలు జరపాలని కమిటీ డిమాండ్ చేసింది. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, జేఎల్ఎం గ్రేడ్-2లకు ఏపీఎస్ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు అంశాల్లో రాజీ లేకుండా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.ప్రభుత్వం స్పందించకపోతే ఏపీ పవర్ జేఏసీ తో పాటు విద్యుత్ స్ట్రగుల్ కమిటీ కూడా సమ్మెలో పాల్గొంటుందని హెచ్చరించింది. సమావేశంలో జి.వి. రాఘయ్య, దండే రవికుమార్, జి.వి. కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

విద్యుత్ ఉద్యోగులకు

సిఐటియు నేతల పరామర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విజయవాడ విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై.. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యుత్ ఉద్యోగులను సిఐటియు నేతలు పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రిమ్స్ వైద్యశాల సూపరింటెండెంట్‌కు, డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కె వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు సహాయ చర్యలు చేపట్టడంలో చొరవ చూపిన ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండెంట్ కట్టా వెంకటేశ్వర్లుకు నేతలు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసులు, జిబి కొండారెడ్డి, కార్యదర్శి జి శ్రీనివాసులు, నగర కార్యదర్శి టి మహేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పీ కల్పన,యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వెంకటేశ్వర్లు, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జివి రాగయ్య, సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను నిర్ణీత గడువు లోపు చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యు అధికారి బి.చిన ఓబులేసుతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, పార్ధసారధి, విజయజ్యోతి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధికారులు

'జీఎస్టీ సేవింగ్స్'పై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గిగ్‌వర్కర్ల ద్విచక్ర వాహన ర్యాలీ సోమవారం నాడు ఒంగోలులో నిర్వహించారు. ఈ ర్యాలీ డీమార్ట్ నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు సాగింది. ర్యాలీలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కనకదుర్గ భవాని, డిఆర్ఓ ఓబులేషు, జడ్పీ సిఇఒ చిరంజీవి, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిపిఒ ఎం.వెంకటేశ్వరరావు, జిఎస్టీ జిల్లా నోడల్ ఆఫీసర్ సత్యప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాలకు భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వివిధ అభివద్ధి కార్యక్రమాలలో భూసేకరణ ప్రక్రియ పై సంబంధిత ఆర్‌డిఓలు, మండల తహసిల్దార్లతో కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి తక్షణమే భూమి సేకరించాలని కలెక్టర్ చెప్పారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలలో 203.48 ఎకరాల ప్రభుత్వ భూమి, 1,591.17 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉందన్నారు. మంచినీటి ట్యాంకుల శుభ్రపరిచే ప్రక్రియ యూనిట్ ఏర్పాటు కోసం బాపట్ల మూలపాలెంలో రెండు ఎకరాలు, చీరాల దేవాంగపురి పంచాయతీలో 1.47 ఎకరాలు, ఇసుకపల్లిలో 3.5 4 ఎకరాలు, రేపల్లె బేతపూడిలో 1.35 ఎకరాలు సేకరించాలన్నారు. సాంకేతిక సమస్య రావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉందన్నారు. నల్లమడ కాల్వ ఆధునీకీకరణ పనులకు సంబంధించిన సర్వే రెండు వారాలలో పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూ సేకరణ వేగంగా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జాతీయ రహదారి-544 జి నిర్మాణం కోసం జిల్లాలో 19.8 హెక్టార్లు సేకరించగా, మరో 4.5 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉందన్నారు. జాతీయ రహదారి-167 ఏ నిర్మాణానికి 88.38 హెక్టార్లలో భూమి సేకరించగా, మిగిలిన రెండు హెక్టార్లు త్వరగా సేకరించాలన్నారు. భూమి సేకరించినప్పటికీ 158 మందికి నగదు చెల్లింపు జరగకపోవడం ఏమిటని ఆరా తీశారు. వినుకొండ నుంచి గుంటూరు రహదారి విస్తరణ పనులకు బాపట్ల జిల్లా పరిధిలో భూ సేకరణ ప్రక్రియ నవంబర్ లోగా పూర్తి చేయాలన్నారు. రొంపేరు కాలువ నిర్మాణానికి 117.45 ఎకరాల భూమి సేకరించగా, ఇందులో కొందరికి నేటికీ నగదు చెల్లించక పోవడంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్,

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఆర్డీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి..

జిల్లా ప్రజలకు నాణ్యమైన సేవలందించి సంతప్తి పరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉన్న గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్.ఇకి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గైర్హాజరు అయిన ఆర్‌అండ్ బి శాఖ ఎస్.ఇ కి సంజాయిషీ నోటీసులు జారీ చేయవలసిందిగా అధికారులకు సూచించారు. సంతమాగులూరు మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అల్పపీడన ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఈ నెల 17వ తేదీ వరకు సి.పి.ఆర్ వారోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, కె.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ ఎస్.లవన్న, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను పూర్తిగా అరికట్టాలి

కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పూర్తి స్థాయిలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టేలా ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో నాటుసారా తయారీ నిర్మూలనకు

కలెక్టర్‌కు నూతన పాలసీ విధానం అమలు వివరాలను వెల్లడిస్తున్న ఆయేషాబేగం

తీసుకున్న చర్యలు, బెల్ట్ షాపుల నిర్వాకులపై కేసుల నమోదు, నూతన ఎక్సైజ్ పాలసీ విధానం అమలు తదితర వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టరుకు వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా

శాశ్వత పరిష్కారం చూపాలి..

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధి లో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్టపరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరలా పునరావతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 66 మంది అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి ఏ.శ్రీనివాసరావు, బిసిఆర్బి ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 71 ఫిర్యాదులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు మరియు పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు ప్రత్యక్షంగా వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుతో అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యల సవివరాలను తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, తక్షణ పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు అధికారులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఒంగోలు తాలూకా సీఐ విజయకష్ణ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, దర్శి సీఐ రామారావు, కంభం సీఐ మల్లికార్జున రావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు, రైతులు

పశువైద్యుడిని నియమించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ముండ్లమూరు మండలం ఈదర పశు వైద్యశాలకు శాశ్వత (పర్మినెంట్) పశువైద్యుడిని నియమించాలని రైతులు, గొర్రెలు-మేకల పెంపకందారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన మీకోసం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పంట ఏడుకొండలు, మాజీ సర్పంచ్ మక్కెన రత్తయ్య, బీవీ పాలెం పిఏసిఎస్ అధ్యక్షులు కె రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.